## మహిళలు అభివృద్ధి చెందాలి..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసా, ఫిబ్రవరి 17 : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. శనివారం భట్టి గల్లిలోని మున్నూరుకాపు సంఘ భవనంలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా మహిళల సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలు అధికంగా ఉన్నాయని, నీటి వనరులు తక్కువగా ఉన్నందున మహిళలు అభివృద్ధికి నోచుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. మహిళలకు బ్యాంకు అధికారులు రుణాలు అందించి అభివృద్ధికి ప్రోత్సహించాలని కోరారు. ఇందులో భైంసా మండల ఎంపీపీ రజాక్, మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, నాయకులు దత్తాత్రి, పోశెట్టి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

బోథ్, ఫిబ్రవరి 17 : ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నల్లాల రాజేందర్‌కు బీమా కింద మంజూరైన చెక్కును శనివారం హోంశాఖ మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అందించారు. పార్టీ క్రియాశీల కార్యకర్తగా వ్యవహరించిన రాజేందర్ ఇటీవల పాము కాటుతో మృతిచెందాడు. పార్టీ బీమా వర్తించడంతో రూ.2 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును తెలంగాణ భవన్‌లో రాజేందర్ సోదరుడు నల్లాల రవీందర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ బోథ్ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు ఆడెపు శ్రీనివాస్, అలీమొద్దీన్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి రామన్న, ప్రజాప్రతినిధులు



భైంసా టౌన్ : స్వీట్లు పంచుతున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ఇచ్చోడ : ముక్రా(కే) పొలంలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మాజీ సర్పంచ్, రైతులు ➤

# బాపు.. వెయ్యేళ్లు వర్ధిల్లు..

- తెలంగాణ జాతిపిత, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు
- కేక్ కటింగ్.. రోగులకు పండ్లు పంపిణీ.. పొలాల్లో పాలాభిషేకం..

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ) : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత, తెలంగాణ జాతిపిత కేసీఆర్ జన్మదినం సందర్భంగా శనివారం ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. బాపు పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు కేక్ కటింగ్, దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బాపు.. వెయ్యేళ్లు వర్ధిల్లు అని దీవించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్నతోపాటు నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని దేగాంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి స్వీట్లు పంపిణీ చేశారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని భగవంతున్ని ప్రార్థించారు. ముక్రా(కే)లో రైతులు దళితబస్తీ పథకంలో భాగంగా తమకు బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన భూముల్లో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

### తెలంగాణ బాపుగా కేసీఆర్.. : మాజీ మంత్రి రామన్న

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేసిన మహనీయుడు కేసీఆర్ అని మాజీ మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆదిలాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించిన జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర బాపుగా కేసీఆర్ ప్రతిష్ఠను సంపాదించారని తెలిపారు. ఉద్యమ నాయకుడైన కేసీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా కృషి చేశారని తెలిపారు. పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల ఫలితంగా రైతులు, మహిళలు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజల ఉపాధి మెరుగు పడిందన్నారు. బీఆర్ఎస్ నాయకు లు యూనిస్ అక్బానీ, రోకండ్ల రమేశ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, సాజిదొద్దీన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీశ్, దాసరి రమేశ్, స్వామి, మహిళా నాయకురాళ్లు స్వరూపారాణి, మమత, ప్రేమల, సుల్తానా పాల్గొన్నారు.






## ఇంటి వద్దకే మేడారం ప్రసాదం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 17 : మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జరుగుతుండగా.. జాతరకు వెళ్లలేని భక్తులకు ఆర్టీసీ, దేవాదాయ శాఖ సంయుక్తంగా ప్రసాదం(బంగారం) ఇంటి వద్దకు పంపించే సదుపాయాన్ని కల్పించింది. ఆదిలాబాద్ రీజియన్‌లోని అన్ని డిపోల పరిధిలో గుర్తించిన లాజిస్టిక్ కౌంటర్లలో రూ.299 పేటీఎం ద్వారా చెల్లిస్తే జాతర ముగిసిన తర్వాత సిబ్బంది ప్రసాదాన్ని ఇంటివద్దకే తీసుకొచ్చి ఇస్తారని డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు నిర్మల్, భైంసా డిపో ప్రయాణికులు 9154298547 సంప్రదించాలని కోరారు.

## దరఖాస్తు చేసుకోవాలి..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 : ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు వ్యవసాయ, వెటర్నరీ, హార్టికల్చర్, ఫిషరీస్ డిప్లొమా పాలీసెట్–2024కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 22 చివరి తేదీ అని, మే 17వ తేదీన పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పదో తరగతి పూర్తయిన, చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ మూడేండ్ల డిప్లొమా కోర్సుల్లో 60 సీట్ల చొప్పున ఉన్నాయని వివరించారు. ఉట్నూర్ ఆదర్శ రెసిడెన్షియల్ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్ డిప్లొమా కోర్సుల్లో 60 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి..

- కేజీబీవీని సందర్శించిన పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మ

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 17 : ఇంటర్మీడియట్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు విద్యార్థులను తీర్చిదిద్దాలని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ పద్మ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని అర్బన్ కేజీబీవీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సబ్జెక్టుల్లో సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు పూర్తయ్యాయని ఫైనల్ పరీక్షలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి సుజాత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆధార్ సెంటర్ వద్ద బారులు

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 : ఆదిలాబాద్ పట్టణంలోని మావల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ప్రజలు బారులుదీరారు. ఆధార్ కార్డు అప్‌డేట్, మార్పులు–చేర్పులు, నూతన ఆధార్ కార్డు కోసం పరుగులు పెడుతున్నారు. క్యూ లైన్‌లో నిలబడిన 50 మందికి మాత్రమే సిబ్బంది టోకెన్లు అందజేస్తున్నారు. దీంతో ఆధార్‌కార్డుదారులు అవస్థలు పడుతున్నారు.



ఆధార్ సెంటర్ వద్ద బారులుదీరిన ప్రజలు

## జయంతి ఏర్పాట్లను పరిశీలించిన ఐటీడీఏ పీవో

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 17 : శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి ఉత్సవాల ఏర్పాట్లను శనివారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పరిశీలించారు. ఈనెల 20వ తేదీన నిర్వహిస్తుండగా.. రామ్ లీల మైదానంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శాఖలవారీగా కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించి సక్సెస్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేశ్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## కనుచూపు మేర బీడు భూములే..



బీడుగా మారిన భీమన్న చెరువు ఆయకట్టు

- భీమన్న చెరువు ఆయకట్టుకు అందని నీరు
- యాసంగి పంటకు సెలవు ప్రకటించిన రైతన్నలు
- కూలీ పనులకు వెళ్తున్న అన్నదాతలు

పెంబి, ఫిబ్రవరి 17 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ నియోజకవర్గంలోని పెంబి మండల రైతులకు భీమన్న చెరువే ఆధారం. డీ–28 కాలువ మరమ్మతులకు నోచుకోకపోవడంతో 250 మంది కర్షకులకు చెందిన 300 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగుకు నోచుకోని భూములు కేసీఆర్ సీఎం అయ్యాక కాలువకు మరమ్మతులు చేయించారు. చెరువును మిషన్ భగీరథ కింద పూడిక తీయించారు. ఫలితంగా నీరు నిల్వ ఉండడంతోపాటు భూగర్భజలాలు కూడా పెరిగాయి. దీంతో వానకాలం, యాసంగి పంటలకు ఢోకా లేకుండా పోయింది. ఒక్క యాసంగిలోనే 7,500 టన్నులకు పైగా ధాన్యం పండించారంటే అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం ఈ యాసంగికి నీరు అందే పరిస్థితి లేదు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ రవికుమార్‌ను సంప్రదించగా.. డీ–28 కాలువ టైగర్ రిజర్వు ఫారెస్టులో ఉన్నదని, అటవీ శాఖ అధికారులు పనులు చేపట్టకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. అనుమతులు ఇస్తే మరమ్మతు చేపట్టి భీమన్న చెరువుకు నీరందిస్తామని, తద్వారా భూములకు నీరందుతున్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకుని అనుమతులు ఇప్పించాలని రైతులు కోరుతున్నారు.

# రిమ్స్‌లో క్రిటికల్ కేర్ యూనిట్



రిమ్స్‌లో కొనసాగుతున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణ పనులు


- రూ. 23 కోట్లతో నిర్మాణం
- అందుబాటులో ఎమర్జెన్సీ వైద్యం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 17(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరైంది. దీంతో అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారు, పురుగుల మందు తాగిన వారు, గుండెపోటు బాధితులకు సేవలు అందుతాయి. రిమ్స్ ఆవరణతో నిర్మించనున్న ఈ యూనిట్ పనులు టీఎస్ఎంఐడీసీ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ఆ ప్రదేశంలో క్యాంటిన్, మందులు పంపిణీ కేంద్రం ఉండగా వాటిని ఇతర ప్రాంతాలకు తరలించారు. రూ.23 కోట్లు మంజూరు కాగా.. రూ.12.79 కోట్లతో భవనం, రూ.10.21 కోట్లతో పరికరాల కోసం వెచ్చిస్తారు.

### మెరుగైన వైద్య సేవలు

కేసీఆర్ ప్రభుత్వం జిల్లావాసులకు ఉచిత వైద్యసేవలు అందించడానికి పకడ్బందీ చర్యలు చేపట్టింది. రిమ్స్‌తో పాటు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టింది. అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచడంతోపాటు టీ–డయాగ్నోస్టిక్ కేంద్రంలో 52 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారు. క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటు ఫలితంగా మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి. జిల్లాలో 80 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారి 44తోపాటు ఇతర రోడ్లపై ప్రమాదాలు జరుగుతుంటాయి. క్షతగాత్రులను రిమ్స్‌కు తీసుకొస్తారు. ఇక్కడ చికిత్స అనంతరం హైదరాబాద్, నాగ్‌పూర్ వంటి ప్రాంతాలకు తీసుకెళ్తారు. రెండు పట్టణాలకు వెళ్లాలంటే నాలుగైదు గంటల సమయం పడుతున్నది. దీంతో అత్యవసర సమయాల్లో సరైన వైద్యసేవలు అందక ప్రాణాలు పోతున్నాయి. క్రిటికల్ కేర్ సెంటర్ ఫలితంగా ఎమర్జెన్సీ సేవలు స్థానికంగా అందుతాయి.

### అత్యవసర సేవలు అందుతాయి..



రిమ్స్‌లో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ వల్ల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రమాదాల బారిన పడి గాయపడిన వారు, పురుగుల మందు తాగిన వారితోపాటు ఇతర కారణాలతో ప్రాణపాయ స్థితిలో వచ్చిన వారికి ఇక్కడే మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ఇందులో వైద్యనిపుణులు, సిబ్బంది నియమిస్తే ప్రయోజనం ఉటుంది. - జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

# 'పది'పై ప్రత్యేక శ్రద్ధ

- మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల ప్రణాళిక
- విద్యార్థులకు రోజు ప్రత్యేక తరగతులు.. సందేహాల నివృత్తి

ఇచ్చోడ/నార్నూర్, ఫిబ్రవరి 17 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి జడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గిరిజన ఆశ్రమోన్నత, గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. మార్చి 18వ తేదీన నిర్వహించే పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందుకుగాను ప్రభుత్వం నవంబర్ 1వ తేదీ నుంచి ప్రత్యేక తరగతులను ప్రారంభించింది. రోజు ఉదయం 8.30 నుంచి 10 గంటల వరకు.. సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మొదటి ప్రీ ఫైనల్ పరీక్షలు మార్చి 1 నుంచి 11 వ తేదీ వరకు ఉండగా.. మార్చి18 నుం చి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10,405 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. ఇందులో బాలికలు 5,192, బాలురు 5,213 ఉన్నారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. తక్కువ మార్కులు వస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఈ యేడాది ఏడు పేపర్లు ఉంటాయని, దీనిపై కూడా అవగాహన కల్పిస్తున్నారు.



జామడ పాఠశాలలో సందేహాలను నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు